క్లుప్తంగా

పేద విద్యార్థులకు ఉన్నత విద్య



మాట్లాడుతున్న కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం : ప్రతి పేద విద్యార్థికి ఉన్నత విద్య అందాలని గంగాధర నెల్లూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి ఆకాంక్షించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ ప్రతి పేద విద్యార్థి చదువుకు దూరం కాకూడదని ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్‌ మీడియం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. వాటికి అనుగుణంగా కరికులంలో మార్పులు చేసి విప్లవాత్మకమైన అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను తీసుకొచ్చి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడం జరిగిందన్నారు.

తీరనున్న తాగునీటి సమస్య

శ్రీరంగరాజపురం : మండలంలోని చిన్నబాపనపల్లి దళితవాడకు సర్పంచ్‌ రఘునాథరెడ్డి సహకారంతో ఎంపీడీఓ మోహన్‌మురళి చొరవతో తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి దేవళంచెరువులో తాగునీటి బోరు మునిగిపోయింది. గ్రామానికి తాగునీటి సౌకర్యం లేకపోవడంతో రెండు రోజుల్లో రూ.3 లక్షలతో జిల్లా పరిషత్‌ నిధులతో శాశ్వతంగా నూతన బోరు వేసి మోటారు, పైప్‌లైన్‌ ఏర్పాటు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారులు కుమార్‌స్వామి, చంద్రరెడ్డి పాల్గొన్నారు.

బ్యానర్‌ను ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలి



పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలో యు.ఎం.పురం గ్రామానికి చెందిన యువకులు, వైఎస్సార్‌ అభిమానులు సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్‌ బ్యానర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా క్రియాశీల కార్యదర్శి కుప్పయ్య, ఎంపీపీ సరిత జనార్దన్‌ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ కక్షలతోనే కూటమి పార్టీలకు సంబంధించిన వ్యక్తులు ధ్వంసం చేశారన్నారు. బ్యానర్‌ను ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ యువ కార్యదర్శి శ్రీధర్‌, యు.ఎం.పురం యువకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

వెదురుకుప్పం: మండలంలోని ఎర్రగుంట సమీపంలో ఉన్న ఓ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం సాయంత్రం ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వెదురుకుప్పం పోలీసులు కథనం ...తిరుపతి బొజ్జాతారకం కాలనీకి చెందిన వెంకటరమణ(27), శీను ఇద్దరూ కలిసి శుక్రవారం వ్యాపారం నిమిత్తం పచ్చికాపల్లంకు వచ్చారు. వ్యాపారం ముగించుకుని సాయంత్రం 4.30 సమయంలో పచ్చికాపల్లం మద్యం దుకాణంలో మద్యం తీసుకుని రాజబావి కనుమ దాటుకున్నాక తిరుపతి రోడ్డు పక్కన చెక్‌ డ్యామ్‌ వద్దకు చేరుకున్నారు. అక్కడ మద్యం సేవించి నీటిలో కొంత సేపు మునిగారు. ఆ తర్వాత ఇక వెళదాం అని శీను చెప్పడంతో.. నువ్వు వెళ్లు బట్టలు వేసుకుని వస్తానని వెంకటరమణ చెప్పాడు. దీంతో శీను రోడ్డు పైకి వచ్చాడు. ఆపై ఎంతసేపటికీ అతను రాకపోవడంతో అనుమానం కొద్దీ చెక్‌డ్యామ్‌ వద్దకు వెళ్లి నీటిలో ఉన్న వెంకటరమణను పైకి తీసుకొచ్చి లేపే ప్రయత్నం చేశాడు. అయితే అప్పటికే అతను మృతి చెందాడు. కాలుజారి పడిపోవడంతో బలమైన గాయంతోగానీ, నీటిలో ఊపిరి ఆడక మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేశారు.

పాతకక్షలతో ఘర్షణ

–ఇద్దరికి గాయాలు

వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు గ్రామంలో శుక్రవారం జరిగిన ఇరువర్గాల దాడిలో ఇద్దరికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. మాంబేడు గ్రామానికి చెందిన కుమార్‌కు, గురవారెడ్డికి గత మూడు సంవత్సరాలుగా పాత కక్షలు ఉండేవి. ఈనేపథ్యంలో కుమార్‌ తరఫున అదే గ్రామానికి చెందిన ప్రకాష్‌, చిరంజీవి గ్రామంలోని మనోహర్‌ రెడ్డి కుమార్తె వెన్నెలపై దాడిచేసినట్లు తెలిపారు. దీంతో మనోహర్‌ రెడ్డి కత్తితో ప్రకాష్‌, చిరంజీవిపై దాడి చేసినట్లు శుక్రవారం రాత్రి వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడిన వారు తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు చెప్పారు.

శ్మశాన వాటికల నివేదికలు సమర్పించాలి

బంగారుపాళెం: మండలంలోని ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన శ్మశాన వాటికల నివేదికలను సమర్పించాలని తహసీల్దార్‌ బాబురాజేంద్రప్రసాద్‌ అన్నారు. స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో శుక్రవారం వీఆర్‌ఓలు, విలేజ్‌ సర్వేయర్లతో సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో ఎస్సీ, ఎస్టీల గ్రామాల్లో శ్మశాన వాటికలకు సంబంధించి స్థలాన్ని పరిశీలించి సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో శ్మశాన వాటికల్లో ఎవరైనా ఆక్రమణదారులు ఉంటే అటువంటి వ్యక్తులు స్వచ్ఛందంగా ఆ స్థలం వదలుకోవాలని సూచించారు. శ్మశాన స్థలాల సర్వేకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో పలువురు ఎస్సీ ఎస్టీలు శ్మశాన స్థలాల దురాక్రమణపై ఫిర్యాదులు ఇచ్చారన్నారు. శ్మశాన వాటికలకు సంబంధించి మంగళవారంలోపు నివేదికలు అందించాలని కోరారు.

ప్రమాదకరంగా మారిన బలిజ కండ్రిగ–చిత్తూరు రోడ్డు



నీవానది వంతెనపై గుంతలు



రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం

- గుంతలమయంగా గ్రామీణ రోడ్లు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు

కూటమి వైఫల్యం

జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో వర్షాలకు దెబ్బతిన్న బీటీ రోడ్లను మరమ్మతు చేయడానికి పనులు సాగుతున్నా జీడీనెల్లూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్రాంతిలోపు బీటీ రోడ్లపై ఏర్పడ్డ గుంతలను మరమ్మతు చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామన్న మాటలు నీటి మూట అయ్యాయి.



గుంతలమయంగా మారిన కార్వేటినగరం డైట్‌ రోడ్డు

కార్వేటినగరం: జీడీనెల్లూరు నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లు గుంతలమయంగా మారాయి. ఆ రోడ్లపై ప్రయాణం అంటే ఇంటికి క్షేమంగా చేరుకుంటామన్న నమ్మకం లేదు. నియోజకవర్గంలోని పాలసముద్రం మండలం బలిజకండ్రిగ మీదుగా చిత్తూరుకు వెళ్లే ఆర్‌ అండ్‌బీ రోడ్డు దుస్థితికి చేరుకుని ప్రయాణం నరకంగా మారింది. రోడ్లపై భారీ గోతులు, ఏర్పడడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. నవంబర్‌ నుంచి ఇప్పటి వరకు సుమారు 60 మంది గుంతల్లో పడి గాయాల పాలయ్యారు. అదే విధంగా నియోజకవర్గంలోని పెనుమూరు మండల కేంద్రం నుంచి చిత్తూరుకు వెళ్లే మార్గం గుంతల మయంగా మారి వర్షం వస్తే చెరువును తలపిస్తోంది. ఈ మార్గంలో రైతులు తాము పండించే పంటలను చిత్తూరుకు తరలిస్తుంటారు. అలాగే కళాశాలలకు విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. మూడు నెలలుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు మరింత దెబ్బ తినడంతో ఆ రోడ్డుపై ప్రమాణం నరకంగా మారింది.

దుర్భరంగా పల్లె రోడ్డు

కూటమి ప్రభుత్వం కార్యకర్తల కోసం ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ పథకం ద్వార వచ్చిన నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. అయితే పనుల్లో నాణ్యత లేకపోవడంతో దుర్భర స్థితికి చేరుకున్నాయి. కార్వేటినగరం మండల కేంద్రం నుంచి డైట్‌ కళాశాలకు వెళ్లే మార్గం దారుణంగా ఉంది. సుదూర ప్రాంతాల నుంచి డీఎడ్‌ శిక్షణ కోసం వచ్చిన ఛాత్రోపాధ్యాయులు గుంతలమయమైన రోడ్డుపై నడవ లేక ఇబ్బందులు పడుతున్నారు. అమ్మపల్లి క్రాస్‌ రోడ్డు నుంచి సురేంద్రనగరం వరకు ఉన్న రోడ్డు కంకర తేలి గుంతలమయంగా మారింది. అమ్మపల్లి క్రాస్‌ రోడ్డు నుంచి తెల్లగుండ్ల పల్లి వరకు ఉన్న బీటీ రోడ్డు దుస్థితికి చేరుకుని రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. జీడీనెల్లూరు మండల కేంద్రాన్ని ఆనుకుని నీవా నదిపై ఉన్న రోడ్డు గుంతలు పడి ప్రమాదాలకు నిలయమైంది. అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో యువతే మరమ్మతులు చేయాల్సి వచ్చింది.

ఎవ్వరికీ పట్టడం లేదు



పాలసముద్రం మండలం బలిజకండ్రిగ మీదుగా చిత్తూరుకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదాలకు నిలయమైంది. కూటమి ప్రభుత్వం కనీసం సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయక పోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

– సుధాకర్‌, బలిజకండ్రిగ, పాలసముద్రం మండలం

ఇబ్బందులు తప్పడం లేదు



క్రిష్టాపురం క్రాస్‌ రోడ్డు నుంచి సురేంద్రనగరం రోడ్డుపై వెళ్లాలంటే ప్రాణాలు అరచేతి లో పెట్టుకోవాల్సి ఉంది. రోడ్డు మొత్తం గుంతలమయమైంది. గుంతల్లోకి నీరు చేరడంతో చెరువును తలపిస్తోంది. ద్విచక్ర వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. పంచర్లు అవుతుండడంతో మా బాధలు దేవుడికే ఎరుక. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి రోడ్లను బాగు చేయాలి.

– వెంకటరత్నం, డీఎంపురం గ్రామం, కార్వేటినగరం

ఆదమరిస్తే .. అంతే



మండల పరిధిలోని పలు ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా మారాయి. చిత్తూరుకు కూతవేటులో ఉన్న గంగాధరనెల్లూరు నీవానదిపై ఉన్న రోడ్డు ఛిద్రమైంది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. నిత్యం మండలం నుంచి వందల సంఖ్యల్లో వాహనాల్లో చిత్తూరుకు ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆదమరిస్తే ప్రాణాలు కోల్పొయే పరిస్థితి నెలకొంది. జిల్లా అధికారులైన స్పందించి నీవానదిపై ఉన్న రోడ్డును మరమ్మతు చేసి, సేఫ్టీ వాల్‌ నిర్మించాలి.

– సుధీర్‌రెడ్డి, వేల్కూరు గ్రామం, జీడీనెల్లూరు మండలం

ఎంజీఆర్‌కు ఘన నివాళి



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంజీఆర్‌ అభిమానులు

నగరి: తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్‌ 108వ జయంతి వేడుకలు శుక్రవారం నగరి మున్సిపల్‌ పరిధిలో ఘనంగా నిర్వహించారు. పుదుపేట, ఏకాంబరకుప్పం, చింతలపట్టెడ, సత్రవాడ, కేవీపీఆర్‌పేట ప్రాంతాల్లో ఎంజీఆర్‌ చిత్రపటాలను ఏర్పాటు చేసి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు. పలువురికి అన్నదానం చేశారు. కొత్తపేట వద్ద ఎంజీఆర్‌ అభిమానులు 108వ పుట్టిన రోజును పురస్కరించుకొని 108 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌ నటరాజన్‌, తమిళ్‌మణి, కళైమణి, కౌన్సిలర్‌ మోహన్‌రాజ్‌, రామన్‌, ఎల్లప్పన్‌ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ సురేంద్రనాయుడు, పక్కన ఎంవీఐ చంద్రశేఖర్‌

పుత్తూరు: రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమేనని సీఐ కేబీ సురేంద్రనాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, కళాశాలల ప్రతినిధులకు, డ్రైవింగ్‌ స్కూల్స్‌ నిర్వాహకులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్‌, సీట్‌ బెల్ట్‌ విధిగా ధరించాలని స్పష్టం చేశారు. సెల్‌ఫోన్‌ మాట్లాడరాదని, మితమైన వేగంతో ప్రయాణించాలని సూచించారు. అలాగే వాహనాల బ్రేకులు, హారన్స్‌, లైట్లు వంటి పరికరాల పనితీరును ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలన్నారు. అలాగే డ్రైవర్లు తగిన విశ్రాంతి తీసుకోవడం ద్వారా మానసిక ఒత్తిడిని అధికమించవచ్చునన్నారు. అనంతరం డ్రైవర్లు, వలంటీర్లు, కళాశాలల యజమానులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంవీఐ పి.చంద్రశేఖర్‌, సహాయ ఇన్‌స్పెక్టర్‌ పొన్నుస్వామి, వాహనాల యజమానులు పాల్గొన్నారు.

పోటాపోటీగా వైఎస్‌ఆర్‌ క్రికెట్‌ టోర్నీ



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌

నగరి: మున్సిపల్‌ పరిధిలోని చింతలపట్టెడలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన వైఎస్‌ఆర్‌ క్రికెట్‌ టోర్నీ–2025 హోరాహోరీగా జరిగింది. 14 టీంలు ఈ పోటీలో పాల్గొన్నాయి. మిడిల్‌ స్ట్రీట్‌ టీం, న్యూ స్ట్రీట్‌ టీం ఫైనల్‌కు చేరుకోగా రెండు టీంల మధ్య గట్టి పోటీ సాగింది. మిడిల్‌ స్ట్రీట్‌ టీం విజేతగా నిలిచి మొదటి బహుమతి రూ.5000 గెలుపొందగా, ద్వితీయ స్థానంలో నిలిచిన న్యూ స్ట్రీట్‌ టీం రూ.3000 బహుమతిని కైవసం చేసుకుంది. ప్రేమ్‌ అనే క్రీడాకారుడు మ్యాన్‌ ఆఫ్‌ ది మ్యాచ్‌ అవార్డును దక్కించుకున్నాడు. శుక్రవారం నిర్వహించిన బహుమతుల పంపిణీ కార్యక్రమానికి మున్సిపల్‌ చైర్మన్‌ పీజీ నీలమేఘం, స్థానిక నేత బీఈ మణి ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్‌ చైర్మన్‌ మాట్లాడుతూ విద్యార్థులకు చదువెంత ముఖ్యమో ఆటలూ అంతే ముఖ్యమన్నారు. గెలుపు కోసం పోరాడుతూనే ఉండాలన్నారు. తప్పులు సరి దిద్దుకుంటూ వెళితే అందరూ ఛాంపియన్లే అన్నారు. ఈ కార్యక్రమంలో క్రికెట్‌ క్రీడాకారులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర

పుత్తూరు: ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్‌ కమిషనర్‌ ఎం.ముంజునాథ్‌గౌడ్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18వ తేదీన పుత్తూరు పట్టణంలో న్యూ ఇయర్‌ క్లీన్‌ స్టార్ట్‌ అనే నినాదంతో పలు రకాల పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మాస్‌ క్లీన్‌ డ్రైవ్‌, బహిరంగ ప్రదేశాలను, చెత్త కుప్పలను, కాల్వలను, పబ్లిక్‌ టాయిలెట్స్‌ను శుభ్రపరుస్తామని వివరించారు. అలాగే రోడ్లకు ఇరువైపులా పెరిగి పోయిన పిచ్చి మొక్కలను తొలగిస్తామన్నారు. ప్రజలు సైతం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ సహకరించాలని కోరారు.

అలరించిన చిన్న కొండచుట్టు



చిన్నకొండచుట్టు సందడి

నగరి: పట్టణంలోని భేరివీధిలో శుక్రవారం నిర్వహించిన చిన్న కొండచుట్టు ఉత్సవాలు చిన్నారులను అలరించాయి. కొండచుట్టు ఉత్సవాలకు మరుసటి రోజున పట్టణంలోని భేరివీధిలో వలస వ్యాపారులు దుకాణాలు పెట్టడం పరిపాటి. దీంతో వీధిలో తిరనాళ్ల సందడి కనిపిస్తుంది. స్థానికులు దీన్ని చిన్న కొండచుట్టు ఉత్సవాలుగా పిలుచుకుంటారు. చిన్నారుల ఆటబొమ్మలు, మహిళలకు సంబంధించిన అలంకరణ వస్తువులు, చెరుకు గడలు, తినుబండారాలు ఇక్కడ అధికంగా విక్రయించారు. వివిధ రకాలైన రంగుల రాట్నాల్లో తిరగడానికి పిల్లలు ఉత్సాహం చూపారు. దీంతో వీధి మొత్తం జనంతో నిండిపోయింది.

చెరుకు కోతకు వచ్చిందా..

- నరికేందుకు జాగ్రత్తలు పాటించాలి



రైతు సాగు చేసి చెరుకు పంట

పాలసముద్రం: చెరుకు గానుగాడించేందుకు నియోజకవర్గంలో సహకార చక్కెర మిల్లుల యాజమాన్యాలు మిల్లుల్లో ఓవర్‌ హాలింగ్‌ పనులు పూర్తి చేశారు. చెరుకులు మిల్లులకు తోలడానికి రైతులు సిద్ధమయ్యారు. కొంత మంది రైతులు బెల్లం తయారు చేసి చిత్తూరు, తమిళనాడు మార్కెట్‌లకు తీసుకెళ్తున్నారు. అక్టోబర్‌, నవంబర్‌ నెలల్లో దీపావళి, దసరా దృష్ట్యా రైతులు బెల్లం తయారీ, అమ్మకాలకు ఆసక్తి కనబరుస్తున్నారు. రైతులు సాగు చేసిన చెరుకు పంట బాగా పక్వానికి వచ్చిన సరైన సమయంలో సరైన విధానంతో నరకాలని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్‌ తెలిపారు.



షుగర్‌ మిల్లుకు తోలుటకు చెరుకు నరుకుతున్న కూలీలు

ఇవీ సూచనలు



వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్‌

- చెరుకును భూమట్టానికి గాని, కొంచెం కిందకుగాని నరికితే తదుపరి కారు కూడా మంచి దిగుబడి వస్తుంది.
- పైకి నరకడం వల్ల హెక్టార్‌కు 3 నుంచి 5 టన్నుల వరకు దిగుబడి తగ్గుతుంది.
- నరికిన 24 గంటల్లో ఫ్యాక్టరీకి తోలడంగానీ లేదా బెల్లం కానీ తయారు చేయాలి.
- ఒకవేళ వెంటనే తరలించడానికి అవకాశం లేకుంటే చెరుకును గుట్టలుగా వేసి చెత్తతో కప్పి నీళ్ల చిలకరించాలి.
- పక్వానికి రాని, ఆలస్యంగా నరికినా, నీటిఎద్దడికి లోనయినా, గొలుసు పురుగు సోకినా చెరుకు రసంలో వండిన బెల్లం తోడుకోనట్టయితే పాకం దించి, చిక్కబడిన తరువాత 5–10 కిలోల బెల్లం పొడి లేదా పంచదార కలపాలి. ఇలా చేస్తే బెల్లం తోడుకొని అచ్చులు పోసుకోవడానికి వీలవుతుంది.
- పొడిరూపంలో బెల్లం చేయడంతో పోషక విలువలు, నాణ్యతా ప్రమాణాలు కలిగి ఉండడమే కాక ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది.
- బెల్లాన్ని దిమ్మలుగా కాకుండా, చిన్న చిన్న ముద్దలుగా చేసి ఆరబెట్టడంతో తేమశాతం 4–5 వరకు తగ్గి పాలిథిన్‌ సంచులలో ప్యాకింగ్‌ చేస్తే ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది.
- ముక్కలు రూపంలో బెల్లం తయారీతో క్వింటాల్‌కు అదనంగా రూ.150 అంటే ఎకరా చెరుకు తోట నుంచి వచ్చే సుమారు నాలుగు టన్నుల బెల్లానికి రూ.7 వేలు అవుతుంది.
- పొడిరూపంలో బెల్లం తయారు చేస్తే క్వింటాల్‌కు రూ.500 వరకు ఆదా అవుతుంది.
- బెల్లం పాకాన్ని పీపాలలో పట్టి భారీ స్థాయిలో మార్కెట్‌ చేయడానికి అవకాశం ఉంటుంది.

అంజేరమ్మ కనుమకు పోటెత్తిన జనం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

వడమాలపేట(విజయపురం): నెల మొదటి శుక్రవారం కావడంతో వడమాలపేట మండలంలోని అంజేరమ్మ కనుమకు భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో అంజేరమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తలు శుక్రవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి అభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిసర గ్రామాల ప్రజలే కాక దూరప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.